# ఊరుంది.. దారి లేదు!

- చుట్టూ ప్రైవేటు భూములు.. మధ్యలో జేకేపల్లి తండా
- దారిలేక తండా వాసుల కష్టాలు
- రైలు పట్టాల పక్కన కాలిబాటే దిక్కు




జొన్నలకొత్తపల్లి తండా ముఖ చిత్రం

**ముదిగుబ్బ:** అత్యవసర వేళల్లో ఆసుపత్రికి పరుగులు తీస్తే గమ్యం చేరే వరకు ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సిందే. పురుటి నొప్పులు వచ్చినా..అంబులెన్స్ అక్కడికి రాలేక మార్గ మధ్యలోనే జరిగిన ప్రసవాలు ఎన్నో..ఈ తండా ఎక్కడో మారుమూల ప్రాంతంలో లేదు. జాతీయ రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో, మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరం ఉంది. జొన్నలకొత్తపల్లి తండాకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. జొన్నలకొత్తపల్లి పంచాయితీ జనాభా 2,500, కాగా 650 నివాసాలు ఉన్నాయి. ఈ పంచాయితీ పరిధిలోని తండాలో 380 జనాభా ఉంది. 80 నివాస గృహాలున్నాయి. తండాలో ఒక ప్రాథమిక పాఠశాల ఉంది. ఆ తరువాత చదవాలంటే 3 కిలోమీటర్ల దూరంలో వున్న జొన్నలకొత్తపల్లి హైస్కూల్‌కు కాలిబాటన వెళ్లాల్సి ఉంటుంది. అదే విధంగా రేషన్ సరుకులు లబ్ధిదారులు పంచాయతీ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. తండాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా మూడు కిలోమీటర్లు నడవాల్సిందే. ఆ గ్రామం చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండడం వల్ల రైతులు అనుమతి ఇస్తేనే కాలిబాట అయినా బండ్ల బాటైనా కొనసాగుతుంది. పంట పొలాలు సాగు చేసినప్పుడు రైల్వే పట్టాల పక్కనే రస్తాగా మార్చుకొని వెళుతుంటారు.

**అత్యవసరమైతే అంతే సంగతులు**

తండాలో నాలుగు చక్రాల వాహనాలు వెళ్లాలంటే రైల్వే ట్రాక్ కింద ఉన్న అండర్ బ్రిడ్జి కింద వెళ్లాల్సి వుంటుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు. ట్రాక్టర్లు, లారీలు ఇతర వాహనాలు రాలేని పరిస్థితి. మహిళలకు పురిటి నొప్పులు వచ్చినా రైలు బ్రిడ్జి కింద అటువైపు అంబులెన్స్ ఉంచి అక్కడి వరకు ఆటోలో తీసుకొస్తుంటారు. అందులో ఉన్న మార్గమంతా ముళ్ల చెట్లు, మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో బురదమయంగా మారి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి.

**అధికారులు పరిశీలించినా...**

ఈ తండా ప్రజలు తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఒకానొక సమయంలో జొన్నలకొత్తపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి ఓట్లు వేసేందుకు నిరాకరించారు. అయితే అప్పట్లో కొంత మంది తండావాసులకు నచ్చచెప్పి ఓట్లు వేయించుకున్నారు. కానీ ఇప్పటి వరకు రోడ్డు సౌకర్యం నోచుకోలేదు. రోడ్డు కోసం పలు ఫిర్యాదులు అధికారులకు ఇచ్చారు. అప్పట్లో ఉన్నతాధికారులు సైతం తండాను సందర్శించారు. తండా వాసులకు రహదారి ఏర్పాటు చేయిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోవడం లేదు.



రైల్వే వంతెన కింద చిన్నపాటి రహదారి

**దారి కోసం భూములు ఇవ్వలేదు**



రహదారిని ఏర్పాటు చేసేందుకు గతంలో కలెక్టర్ అరుణ్‌బాబు ఈ తండాకు వచ్చి పరిశీలించారు. అయితే రోడ్డు వేయడానికి రైతుల నుంచి భూములను సేకరించడానికి ప్రయత్నించారు. అయితే ఇటీవల మార్కెట్‌లో అధిక ధరలు ఉండడంతో రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు రాలేదు. ఒక వేళ భూముల ఇవ్వాలన్నా ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం చాలా తక్కువగా ఉండడంతో రైతులు ముందుకు రావడంలేదు. దీంతో రహదారి ఏర్పాటు నిలిచిపోయింది.

– బి.అనిమే నాయక్. జొన్నలకొత్తపల్లి తండా

**తండాకు 108 రాదు**



ఎవరికైనా అత్యవసర చికిత్స పొందాలంటే 108 వాహనం రావడానికి రహదారి లేదు. దీంతో అర్ధ రాత్రి పూట చేతుల మీద ఎత్తుకొని సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడిచి అక్కడి నుంచి ఆటోల్లో ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. పలుసార్లు అధికారులు వచ్చి పరిశీలించినా రహదారి ఏర్పాటుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తండాకు రహదారి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. తండావాసుల కష్టాలను ఇప్పటికైనా తీర్చాలి.

– హరీష్‌నాయక్, తండా వాసి

## పనితీరు మెరుగుపర్చుకోండి

**తలుపుల :** జిల్లాలోనే తలుపుల మండలం పీపీసీ సభ్యత్వం, ఇంటింటి సర్వేలో చాలా వెనుకబడి ఉందని, పనితీరు మెరుగుపర్చుకోవాలని సచివాలయ సిబ్బందిని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో గురువారం సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ పీపీసీ, ఇంటింటి సర్వే లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

## 21 నుంచి పింఛన్‌దారుల హెల్త్ సర్టిఫికెట్ల పరిశీలన

**ధర్మవరం రూరల్:** ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించి ఈ నెల 21, 22 తేదీల్లో ఫించన్‌దారుల ఆరోగ్య పరిస్థితులు, హెల్త్ సర్టిఫికెట్లను వైద్య బృందం పున:పరిశీలన చేయనుంది. ఈమేరకు ఎంపీడీఓ సాయిమనోహర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇది వరకే పింఛన్‌దారులకు నోటీసు పంపామని, నోటీస్ అందుకున్న పింఛన్‌దారులు ఇంటి వద్దనే ఉండి వైద్యుల బృందానికి సహకరించాలని పేర్కొన్నారు. ఈ నెల 21న ఏలుకుంట్ల, నేలకోట, దర్శనమల, రావులచెరువు, ధర్మపురి, మల్లాకాలువ, సీసీకొత్తకోట గ్రామాలకు చెందిన 20 మంది పింఛన్‌దారులు, అలాగే 22న రేగాటిపల్లి, కుణుతూరు, పోతుకుంట, చిగిచెర్ల, గొట్లూరు, తుమ్మల, మల్కాపురం గ్రామాలకు చెందిన 26 మంది పింఛన్‌దారులకు సంబంధించిన సర్టిఫికెట్లతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తారని తెలిపారు.

## కందిలో పంటకోత ప్రయోగాలు

**బత్తలపల్లి:** మాల్యవంతం గ్రామంలో గురువారం ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసిన కంది పంటలో పంటకోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. గ్రామంలోని సర్వే నంబర్ 393–1డి 2 పొలంలో రైతు రాజేంద్రప్రసాద్, 361–బి సర్వే నెంబర్‌లో రైతు రాంప్రసాద్ సాగు చేసిన కంది పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 1.690 కేజీలు దిగుబడి వచ్చినట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఎంపీఈఓ ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసులు, వీఎస్ఏ లావణ్యలత, బీమా కంపెనీ కోఆర్డినేటర్లు మంజునాథ్, శ్రీనివాసులు, బాషా, రైతులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గోపి

**తనకల్లు:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ గోపి అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై గురువారం వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదన్నారు. మైనర్లు బైక్ నడుపుతూ ఏదైనా ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలన్నారు.

### ఎం.చెర్లోపల్లి యువకుల ఔదార్యం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**బత్తలపల్లి:** ఎం.చెర్లోపల్లికి చెందిన ఇద్దరు యువకులు తమ ఔదార్యంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాగే నారాయణస్వామి తన సొంత డబ్బు రూ.5.5 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పాడు. అలాగే గ్రామానికి చెందిన కప్పల బాలకృష్ణ స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. మినరల్ వాటర్ అవసరమైన వారు రూ.ఐదు కాయిన్ వేస్తే 20 లీటర్లు మంచినీరు వచ్చేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ప్లాంట్ నిర్వహణకు ఉపయోగిస్తామని రాగే నారాయణస్వామి పేర్కొన్నారు. గురువారం ప్లాంట్‌ను టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఎంవి.చౌదరి, రాము, ప్రవీణ్, నాగభూషణ, నారాయణస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### రైతువాణి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, రైతు సంఘం నాయకులు

**కనగానపల్లి:** స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏపీ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో రైతువాణి క్యాలెండర్, డైరీలను ఎస్ఐ రిజ్వాన్ ఆవిష్కరించారు. రైతు సోదరులకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా వీటిని రూపొందించినట్లు ముద్రించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బత్తల కదిరప్ప, జేవీ రమణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగార్జున పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

**ధర్మవరం రూరల్:** ఇటీవల సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల్లో నుంచి డబ్బు చేస్తున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. గురువారం కట్టకిందపల్లిలో తన సిబ్బందితో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మద్యానికి బానిస కాకూడదన్నారు. గొడవలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

**గుడిబండ:** మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ రాజకుల్లాయప్ప, పోలీస్ సిబ్బంది కలసి గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 4150 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్‌రఫీ, పాతన్న పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికడదాం



తనకల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది

**తనకల్లు:** బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీడీపీఓ గంగరత్నమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై మహిళా కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి కమిటీలో సర్పంచు, మహిళా కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు సభ్యులుగా ఉంటారన్నారు. బాల్య వివాహాలపై గ్రామాల్లో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు తగిన పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప, ఎంఈఓ కళ్యాణి, డీసీడీపీఓ శివలత, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, సమత సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులనాయుడు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 8,9 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ



మాట్లాడుతున్న ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుసేన్

**ధర్మవరం అర్బన్:** యువర్స్ ఫౌండేషన్ సహకారంతో ఫిబ్రవరి 8,9 తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు హైబ్రో చెస్ అకాడమీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుసేన్, ఉషోదయ పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా తెలిపారు. స్థానిక కొత్తపేటలోని ఉషోదయ పాఠశాలలో గురువారం వారు మాట్లాడారు. టోర్నీలో ప్రవేశ రుసుం రూ.600 ఉంటుందన్నారు. చెస్ క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేస్తామని తెలిపారు. టోర్నీ ఏపీ స్టేట్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ముఖ్య అతిథులుగా ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రవిరాజ్, టోర్నీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారావు హాజరవుతారన్నారు. టోర్నీలో మొత్తం నగదు బహుమతి రూ.60వేలు అని తెలిపారు. వివరాలకు 9912647370, 08559–221813 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి మోహన్, కోటేశ్వరరావు, టోర్నీ ఆర్గనైజర్ డైరెక్టర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## కేసు నమోదు

**కదిరి టౌన్:** స్కూటీతో ఢీకొన్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గాండ్లపెంట సచివాలయంలో పంచాయితీ సెక్రటరీగా పనిచేస్తున్న సయ్యద్ బాషా మేదర వీధిలో నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం బైక్‌పై వెళ్తుండగా మదనపల్లి రోడ్డు ఆహా టీస్టాల్ వద్ద బర్గ్ మెన్ వీధికి చెందిన నిజాముద్దీన్ స్కూటీతో ఢీకొట్టాడు. ఘటనలో సయ్యద్ బాషాకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిజాముద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

**మహిళపై దాడి..**

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..పట్టణంలోని వికలాంగుల కాలనీలో నివాసం ఉన్న పెద్దపల్లి అనూష గతంలో చిత్తూరు జిల్లా వాయల్పాడుకు చెందిన ఇమ్రాన్‌తో సహజీవనం చేసింది. అయితే కొంతకాలంగా అతడికి దూరంగా ఉంటోంది. గురువారం ఇమ్రాన్ అనూష ఇంటికి చేరుకుని ఆమెను వేధించడంతోపాటు దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## మహిళపై దాడి తగదు

**సోమందేపల్లి:** పెనుకొండ మండలంలోని మునిమడుగులో వెంకటలక్ష్మి అనే మహిళను వివస్త్రను చేసి, దాడి చేయడం తగదని ఐద్వా అధ్యక్షురాలు గౌతమి అన్నారు. గురువారం సాయినగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సవిత ఒక మహిళ అయి ఉండి కూడా ఆమె సొంత నియోజకవర్గంలో మహిళలకు రక్షణ కరువు అయ్యిందన్నారు. ఈ ఘటనపై మంత్రి స్పందించకపోవడం బాధాకరం అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## సత్యసాయి సేవాదళ్ సభ్యులకు భోజన వసతి



రైల్వేస్టేషన్‌లో సేవాదళ్ సభ్యులకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

**ధర్మవరం అర్బన్:** పాడేరు నుంచి పుట్టపర్తికి వస్తున్న సత్యసాయి సేవాదళ్ సభ్యులకు భోజన వసతి కల్పించామని సుబ్బదాసు భజన మందిరం, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం పాడేరు నుంచి పుట్టపర్తికి వస్తున్న 40 మంది సత్యసాయి సేవాదళ్ సభ్యులకు శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు భోజన వసతి కల్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## రహదారి నిబంధనలతో ప్రమాదాల నివారణ



కదిరిలో జెండా ఊపి ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీఓ వీవీఎస్ శర్మ



ధర్మవరంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం సత్యనారాయణ

**కదిరి అర్బన్:** రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆర్టీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయం ముందు ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీఓతో పాటు డీఎస్పీ శివనారాయణస్వామి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వాహనచోదకులందరూ రహదారి భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడం మన భద్రతకే అన్న విషయం గుర్తించుకోవాలన్నారు. అతివేగం, డ్రంకెన్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం రహదారి భద్రతా మాసోత్సవాల ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సిఐ నాగేంద్రతో పాటు వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

**ధర్మవరం అర్బన్:** రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిదని టూటౌన్ సీఐ రెడ్డెప్ప, ఆర్టీసీ డీఎం సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో యాంత్రిక తప్పిదాల కారణంగా ప్రమాదాలు జరిగేవన్నారు. ఇప్పుడు అధిక శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అజాగ్రత, అవగాహన లోపం కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సూపర్‌వైజర్లు, యూనియన్ల నేతలు తదితరులు పాల్గొన్నారు.

**కదిరి అర్బన్:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీలో డీఎం మైనోద్దీన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్, పట్టణ సీఐ నారాయణరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తతతో వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పెద్దన్న, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాజీ సైనికులకు ఘన సన్మానం



మాజీ సైనికులను సన్మానిస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

**ధర్మవరం అర్బన్:** ఆర్మీడేను పురస్కరించుకుని మాజీ సైనికులకు ఘనంగా సన్మానించినట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్, కార్యదర్శి జయరాం తెలిపారు. పట్టణంలోని యువర్స్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం మాజీ సైనికులు రేణిగుంట శ్రీధర్, వంకదారు మోహన్‌ను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. సైనికుల వల్లనే భారతదేశ ప్రజలంతా సంతోషంగా జీవిస్తున్నారని, వారు బార్డర్‌లో ప్రజలందరికి రక్షణగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, డాక్టర్ బీవీ సుబ్బారావు, వైకే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ కృష్ణప్ప

**పుట్టపర్తి:** శ్రీసత్యసాయి జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈఓ కృష్ణప్ప గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యపరంగా జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రతినిధులు డీఈఓకు మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలామ్ ప్రతిమలను అందించారు. జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్‌జిల్లా జిల్లా అధ్యక్షుడు రియాజ్, పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, బుక్కపట్నం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానంలో 'స్వచ్ఛ భారత్'



క్రీడా మైదానంలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

**ధర్మవరం:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛభారత్ నిర్వహించారు. క్రీడా మైదానంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ రకాల కార్యక్రమాలను మంత్రి సత్యకుమార్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మైదానంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డోలా రాజారెడ్డి, శ్యామరావు, పట్టణాధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**కనగానపల్లి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులంతా హాజరవుతారన్నారు. మండలస్థాయి అధికారులంతా హాజరై, తమ ప్రగతి నివేదికలను తెలియజేయాలన్నారు.

## కంది వామికి నిప్పు

**లేపాక్షి:** మామిడిమాకులపల్లిలో రైతు నరసమ్మకు చెందిన కంది వామికి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. ఇటీవల కంది కోతలు పూర్తి కావడంతో పొలంలోనే ఒకచోట కంది వామి వేసింది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు కంది పంటున్న వామికి నిప్పు పెట్టడడంతో మొత్తం కాలిపోయింది. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతు నరసమ్మ తెలిపింది.